ప్రజాశక్తి
సోమవారం 5 మే, 2025

పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు

పరిశీలిస్తున్న ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి

20న అఖిల భారత సమ్మెను విజయవంతం చేయాలి

కార్మిక, ప్రజాసంఘాల పిలుపు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

కార్మిక హక్కులను కాలరాసే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు ఈనెల 20న చేపడుతున్న అఖిల భారత సమ్మె జయప్రదం చేయాలని కార్మిక, ప్రజాసంఘాల నాయకులు పిలుపునిచ్చారు. అఖిల భారత సమ్మె సమ్మె జయప్రదానికి కార్మిక, ప్రజాసంఘాల జిల్లా సమావేశం సిఐటియు జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కార్మిక, ప్రజాసంఘాలు నాయకులు మాట్లాడుతూ బ్రిటిష్ కాలం నుంచి పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం పెట్టుబడిదారీ ప్రయోజనాల కోసం నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి వేసిందని విమర్శించారు. కార్మిక సంఘాలను బలహీనం చేసి యాజమాన్యాల శ్రమ దోపిడీని మరింత పెంచుకోవడం కోసం, అక్రమ తొలగింపులను, పనిభారాన్ని ప్రశ్నించే పరిస్థితి లేకుండా చేయడానికి, పని గంటలు పెంచడానికి లేబర్ కోడ్‌లు తెచ్చారని తెలిపారు. యజమానులు కార్మిక చట్టాలను ఉల్లంఘించినా, గతంలోలా జైలుకు వెళ్లాల్సిన అవసరం లేకుండా కొంత జరిమానా కడితే సరిపోతుందని చట్టాల్లో మార్పులు చేశారని చెప్పారు. యజమానులు చేసే నేరపూరిత చర్యలను నేరాలుగా పరిగణించకుండా కార్మికులు చేసే పోరాటాలను, యాజమానులను ప్రశ్నించినా నేరాలుగా పరిగణించేలా యజమానులు తమ ఇష్టానుసారంగా వ్యవహరించేలా చట్టాలు మారుస్తున్నారని తెలిపారు. పెట్టుబడిదారులకు ఉద్యోగులు, కార్మికులను ఆధునిక బానిసలుగా మార్చే విధంగా కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లు తెచ్చిందన్నారు. కేంద్ర ప్రభుత్వం అదానీ, అంబానీలకు దేశ సంపదను దోచిపెడుతూ కార్పొరేట్ అనుకూల విధానాలు అవలంభిస్తూ కార్మిక, కర్షకులకు ద్రోహం చేస్తుందన్నారు. స్వాతంత్ర్యానంతరం ప్రజల త్యాగాలతో జాతి నిర్మించుకున్న విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్, ప్రభుత్వరంగ పరిశ్రమలు, రైల్వేలు, బ్యాంకులు, ఎల్‌ఐసి, రక్షణ రంగం, గనులు, ప్రకృతి వనరులను కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు ప్రైవేటీకరణను వేగవంతంగా అమలు చేస్తున్నారని చెప్పారు. కార్మిక హక్కులు కాలరాసే లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా పెద్దఎత్తున పోరాడాలని, కార్మికుల జీవన్మరణ సమస్య అని అన్నారు. ఒకవైపు కార్పొరేట్‌లు లాభాలు పెరిగాయని, కార్మికుల నిజవేతనాలు దిగజారాయన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు రాయితీలు ఇస్తూ సామాన్యులపై భారాలు వేస్తుందన్నారు. సమాజంలో మత వైషమ్యాలు పెంచి మత చీలికలు తెస్తుందన్నారు. ధరల పెరుగుదల, అవసరాలు దృష్టిలో పెట్టుకొని కార్మికుల కనీస వేతనం నెలకు రూ.26 వేలుగా నిర్ణయించి అమలు చేయాలని, కనీస పెన్షన్ రూ.తొమ్మిది వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కార్మికులను, స్కీమ్‌వర్కర్లను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్నం భోజన పథకం తదితర స్కీమ్ వర్కర్స్‌కు కనీస వేతనాలు ఇవ్వాలని, పనిభారం తగ్గించాలన్నారు. ఎనిమిది గంటల పనిదినాలను 12 నుంచి 14 గంటలుగా మార్చాలని చూస్తున్నారని చెప్పారు. సమ్మెను జయప్రదం చేసి కేంద్ర ప్రభుత్వానికి హెచ్చరిక చేయాలని కోరారు. సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.తేజేశ్వరరావు, సిహెచ్.అమ్మన్నాయుడు, జిల్లా కోశాధికారి అల్లు సత్యనారాయణ, పట్టణ కన్వీనర్ ఆర్.ప్రకాష్, ఎఐటియుసి జిల్లా గౌరవ సలహాదారు చిక్కాల గోవిందరావు, వైఎస్‌ఆర్ ట్రేడ్ యూనియన్ నాయకులు ఎస్.వెంకటరావు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు ఎం.ఆదినారాయణమూర్తి, బ్యాంకు ఎంప్లాయిస్ ఫెడరేషన్ జాతీయ కేంద్ర కమిటీ సభ్యులు ఎం.శ్రీనివాస్, బిఎస్ఎన్ఎల్ నాయకులు ఎం.గోవర్ధనరావు, రైతుసంఘం నాయకులు కొత్తకోట అప్పారావు, పెన్షనర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు పార్వతీశం, రిమ్స్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రాకోటి చిన్నారావు, మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ నాయకులు టి.ప్రవీణ, పద్మ, కళాసీ యూనియన్ జిల్లా అధ్యక్షులు బోర.చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి తేజేశ్వరరావు

ప్రశాంతంగా 'నీట్' ప్రవేశ పరీక్ష

- 96 శాతం మంది అభ్యర్థుల హాజరు
- నాలుగు కేంద్రాల్లో పరీక్షల నిర్వహణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఎంబిబిఎస్, బిడిఎస్, ఇతర వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించిన 'నేషనల్ ఎలిజిబులిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్' (నీట్) యుజి-2025 ఆదివారం ప్రశాంతంగా జరిగింది. జిల్లాలో పాలిటెక్నిక్ కళాశాల, ఆర్‌జియుకెటి క్యాంపస్, కేంద్రీయ విద్యాలయం, ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల పరీక్షా కేంద్రాల్లో ఆఫ్‌లైన్ పద్ధతిలో పరీక్ష నిర్వహించారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) పర్యవేక్షణలో నిర్వహించిన పరీక్షకు 96శాతం మంది విద్యార్థులు హాజరు కాగా, నాలుగు శాతం మంది గైర్హాజరయ్యారు. ఇంటర్మీడియట్ బైపిసి చదివిన విద్యార్థులు ఈ పరీక్షకు 1568 మంది దరఖాస్తు చేసుకున్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్ట్స్ కళాశాలలో 480 మంది, పాలిటెక్నిక్ కళాశాలలో 240 మంది, ఎచ్చెర్ల ఆర్‌జియుకెటిలో 720 మంది, కేంద్రీయ విద్యాలయంలో 128 మంది పరీక్ష రాయాల్సి ఉండగా వారిలో 41 మంది పరీక్షకు హాజరు కాలేదు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.

నీట్ పరీక్షకు హాజరయ్యేందుకు మధ్యాహ్నం 11 గంటల నుంచే కేంద్రాల వద్దకు విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు చేరుకున్నారు. మధ్యాహ్నం 11.30 గంటలకు పరీక్షా కేంద్రాల్లోకి విద్యార్థులను అనుమతించారు. ఎన్‌టిఎ నిబంధనలకు లోబడి తనిఖీలు చేపట్టి కేంద్రాల్లోకి అనుమతించారు. విద్యార్థులు లోపలకు ప్రవేశించిన తర్వాత సాయంత్రం ఐదు గంటలకు పరీక్ష పూర్తయ్యేంత వరకు తల్లిదండ్రులు పరీక్షా కేంద్రాల వద్దే పడిగాపులు కాశారు. పరీక్షా కేంద్రాలను తొలిసారి జిల్లాలో కేటాయించడంతో వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం అవసరమైన సౌకర్యాలు కల్పించింది.

పరీక్షా కేంద్రాలను పరిశీలించిన ఎస్‌పి

జిల్లాలో నాలుగు 'నీట్' పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాట్లను ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి ఆదివారం పరిశీలించి పోలీస్ అధికారులు, సిబ్బందికి విధి నిర్వహణలపై పలు సూచనలు చేశారు. నీట్ పరీక్షా కేంద్రాలైన పాలిటెక్నిక్ కళాశాల, ఆర్‌జియుకెటి క్యాంపస్, కేంద్రీయ విద్యాలయం, ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలను ఎస్‌పి సందర్శించారు. పరీక్షా కేంద్రాల్లో పకడ్బందీ తనిఖీలు నిర్వహించి అభ్యర్థులను లోపలకు అనుమతించారు. మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు, హ్యాండ్ బ్యాగ్, వ్యాలెట్లు, చేతి గడియారాలు ఇతర వస్తు సామగ్రి పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించకుండా పకడ్బందీగా బందోబస్తు విధులు నిర్వర్తించాలని ఎస్‌పి సూచించారు. పరీక్ష పూర్తయ్యే వరకు ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎలాంటి సంఘటనలు చోటుచేసుకోకుండా పరీక్షా కేంద్రాల వద్ద పకడ్బందీ ఏర్పాట్లు చేశామన్నారు. పరీక్షా కేంద్రాల సమీపంలో జిరాక్స్, ఇంటర్నెట్ షాపులు మూసివేసేలా చర్యలు తీసుకోవాలని, పరీక్షా కేంద్రాల పరిధిలో ఎవరూ గుంపులుగా ఉండకుండా చూడాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. 'నీట్' పరీక్ష నియమ నిబంధనల మేరకు వ్యవహరించాలన్నారు. ప్రతి 'నీట్' పరీక్షా కేంద్రాల పరిసరాల వద్ద డ్రోన్ కెమెరాతో నిఘా ఏర్పాటు చేసి ప్రత్యేక నిఘా పెట్టినట్లు తెలిపారు. అభ్యర్థులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా మౌలిక సదుపాయాలు కల్పించాలని పరీక్ష నిర్వాహకులకు సూచించారు.

సందడిగా ముగిసిన బారువ బీచ్ ఉత్సవం

- పర్యాటకానికి కొత్త వెలుగు
- జన సంద్రమైన తీరం

ప్రజాశక్తి - సోంపేట

శ్రీకాకుళం తూర్పు తీరంలో బారువ బీచ్ ఉత్సవం రెండు రోజులుగా సందడిగా సాగి, ఆనందోత్సాహాల నడుమ విజయవంతంగా ముగిసింది. ప్రకృతి, పర్యాటకం, సాహస క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, స్థానిక రుచులన్నీ ఒకే వేదికపై నిలిచిన ఈ వేడుక పర్యాటక అభివృద్ధికి ఓ ప్రేరణగా నిలిచింది. ప్రతి ఉదయం తాబేలు పిల్లల సముద్ర ప్రయాణంతో ప్రారంభమైన ఈ ఉత్సవం, పర్యావరణ పరిరక్షణకు జీవంత నిదర్శనమైంది. వాలీబాల్, ట్రెజర్ హంట్‌లు, కయాకింగ్, స్నోర్కెలింగ్ వంటి సముద్ర క్రీడలతో యువతను ఆకట్టుకోగా, శాండ్ స్కల్ప్చర్, ఓపెన్ ఆర్ట్ పోటీలు కళాకారుల ప్రతిభను ప్రపంచానికి పరిచయం చేశాయి.

బారువ తీరం జనసంద్రం

పలు ప్రాంతాల నుంచి విచ్చేసిన సందర్శకులు స్థానిక వంటకాలను ఆస్వాదించడంతో పాటు శ్రీకాకుళం సాంస్కృతిక వారసత్వాన్ని ప్రత్యక్షంగా చూశారు. యశస్వి కొండేపూడి, జానపద కళాకారుల ప్రదర్శనలు ప్రేక్షకులను ఉర్రూతలూగించాయి. శ్రీ నటరాజ నాట్య మండలి, సోంపేట, బిందు కామేశ్వరీ శిష్య బృందం వారు చేసిన జానపద నృత్య గీతాలు అలరించాయి. రెండు రోజుల పాటు వేలాది మంది ప్రజల హాజరు, సామాజిక మాధ్యమాల్లో పాజిటివ్ స్పందనతో ఈ వేడుక తీరప్రాంత పర్యటనకు కొత్త దిశగా మారింది. ముగింపు రోజైన ఆదివారం బారువ తీరం జన సంద్రాన్ని తలపించింది. బీచ్ ఫెస్టివల్‌కు స్థానిక ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఉదయం నుంచే చుట్టుపక్కల గ్రామాల నుంచి పర్యాటకులు రావడంతో బీచ్ కళకళలాడింది. సాయంత్రానికి ఎక్కువ సంఖ్యలో పర్యాటకులు బారువ తీరానికి చేరుకున్నారు. వాతావరణం అనుకూలించకపోవడంతో వాటర్ స్పోర్ట్స్‌కు అధికారులు అనుమతి ఇవ్వలేదు.

భవిష్యత్ లక్ష్యం... బారువ జాతీయ బీచ్ టూరిజం హబ్

ఈ ఉత్సవం బారువ బీచ్‌ను పర్యాటక రంగంలో స్థిరంగా నిలబెట్టే తొలి అడుగుగా నిర్వాహకులు భావిస్తున్నారు. సముద్రంలోని నౌక అవశేషాల ఆధారంగా డైవింగ్ టూరిజం, పర్యావరణ విద్యా కేంద్రాల స్థాపన తదితర ప్రణాళికలతో బీచ్ భవిష్యత్ మరింత ఆకర్షణీయంగా మారనుంది. బీచ్ ఫెస్టివల్‌కు 250 మంది సిబ్బందితో బందోబస్తు నిర్వహించినట్లు సోంపేట సిఐ మంగరాజు, మెరైన్ సిఐ రమేష్ కుమార్ తెలిపారు. పోలీసులతో పాటు మెరైన్, రెవెన్యూ, అగ్నిమాపక శాఖ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకున్నారు. బందోబస్తులో సోంపేట, కంచిలి, బారువ, మందస, పలాస ఎస్ఐలు విధులు నిర్వహించారు.

బారువ బీచ్‌లో సందర్శకుల తాకిడి

రెండు నిండు ప్రాణాలను తీసిన వివాహేతర సంబంధం

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

ఆమెకు పదేళ్ల క్రితం వివాహమైంది. ఇద్దరు పిల్లలకు కూడా ఉన్నారు. అయితే భర్తతో కాపురం చేస్తూ వేరొక యువకునితో వివాహేతర సంబంధం పెట్టుకుంది. ఈ సంబంధమే వారిద్దరి ఆత్మహత్యకు దారితీసింది. ఎచ్చెర్ల పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. లావేను మండలం చిన్నయ్యపేటకు చెందిన జీరు మంగమ్మ (32)కు పదేళ్ల క్రితం మండలంలోని కొయ్యాం పంచాయతీ పాతకూర్మినాయుడు పేటకు చెందిన జీరు రమణతో వివాహమైంది. ఈ దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ పిల్లలు ఇద్దరూ కాకినాడలో నివాసం ఉన్న మంగమ్మ తల్లిదండ్రుల వద్ద ఉంటూ చదువుకుంటున్నారు. జీరు రమణలో వ్యవసాయ పనులు, శుభ కార్యాలయ సమయంలో మైక్సెట్, విద్యుతుదీపాల అలంకరణ, సీరియల్ సెట్లు ఏర్పాటు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అయితే మంగమ్మకు ఇదే గ్రామంలో ఉంటున్న లావేరు మండలం అదపాకకు కొయ్యాన లోకేష్ (25)తో పరిచయం ఏర్పడి వివాహేతర సంబంధంగా మారింది. లోకేష్ తల్లి చిన్నప్పుడు మృతి చెందటంతో ఈ యువకుడు పాతకూర్మినాయుడు పేటలో తాత దారపు ఎరకయ్య ఇంటి వద్ద ఉంటున్నాడు. భవన నిర్మాణ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో లోకేష్, మంగమ్మల మధ్య పరిచయం ఏర్పడి అది కాస్త వివాహేతర బంధంగా మారింది. అయితే లోకేష్ శనివారం రాత్రి మద్యం తాగి మంగమ్మను గ్రామం సమీపంలో ఉన్న తోటలోకి కలిసేందుకు రమ్మన్నాడు. ఈమె వెళ్లేందుకు నిరాకరించింది. నువ్వు రాకపోతే ఆత్మహత్య చేసుకొంటానని బెదిరించాడు. అయినా ఆమె వెళ్లకుండా ఫోన్ స్విచ్ ఆఫ్ చేసింది. ఆ సమయంలో మద్యం తాగు ఉన్న లోకేష్ ఆవేశంలో విచక్షణ కోల్పోయి సమీపంలో ఉన్న తన ఇంటి నుంచి పురుగు ముందును తెచ్చి తాగేసి తోటలోనే రాత్రంతా ఉండిపోయాడు. ఆదివారం ఉదయం అటుగా వెళ్లిన గ్రామస్తులు లోకేష్ తోటలో మృతదేహంగా పడి ఉండటాన్ని గమనించారు. వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. లోకేష్ తాతయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే లోకేష్ తనతో రాత్రి ఫోన్‌లో మాట్లాడి ఆత్మహత్య చేసుకోన్నాడని కాల్ డేటా పోలీసులు విచారణలో తెలిసి ఏమైపోతుందోనని భయపడి ఆదివారం ఉదయం 7.30 గంటల సమయంలో తన ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని శవపంచనామా నిర్వహించారు. పోస్టుమార్టం నిమిత్తం జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారు. ఎస్ఐ వి.సందీప్ కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. దీంతో గ్రామంలో విషాదం ఛాయలు అలుముకున్నాయి.

లోకేష్, మంగమ్మ మృతదేహాలు

లోకేష్

మంగమ్మ (ఫైల్)

నివాళ్లర్పిస్తున్న డిఆర్ఒ వెంకటేశ్వరరావు

భగీరథ మహర్షి పట్టుదల స్ఫూర్తిదాయకం

ప్రజాశక్తి - శ్రీకాకుళం

భగీరథ మహర్షి పట్టుదల, ఆయన జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమని జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు కొనియాడారు. భగీరథ మహర్షి జయంతిని కలెక్టరేట్‌లో ఆదివారం నిర్వహించారు. మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరుగునపడిన చరిత్రకారుల జీవితాలను, మహనీయుల గొప్పతనాన్ని వెలికితీసి వారి ఆదర్శ భావాలను ప్రజలకు గుర్తు చేస్తూ ప్రభుత్వం అధికారికంగా ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బిసి సంక్షేమశాఖ అధికారి ఇ.అనురాధ, బిసి సంక్షేమ శాఖ జాతీయ కార్యదర్శి బి.దేవభూషణరావు, ఉప్పర సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు వెంకట రామారావు, కార్యదర్శి గజ్జల మాధవరావు, ఉపాధ్యక్షులు పిండి రాము, కలెక్టరేట్ ఎఒ సూర్యనారాయణ, బిసి వెల్ఫేర్ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో భగీరత మహర్షి చిత్రపటానికి శ్రీకాకుళం డిఎస్‌పి సిహెచ్.వివేకానంద్ పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఏదైనా సాధించాలనే పట్టుదలకు భగీరథ ప్రయత్నం ఒక స్ఫూర్తి అని అన్నారు. కార్యక్రమంలో సిఐ పైడపునాయుడు, ఆర్ఐ కె.నర్సింగరావు, పోలీస్ కార్యాలయ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అరసవల్లి ఆదాయం రూ.10.38 లక్షలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

వైశాఖ మాసం తొలి ఆదివారం కావడంతో అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయానికి రద్దీ పెరిగింది. దీంతో ఆదివారం ఒక్కరోజు రూ.10.38 లక్షల ఆదాయం సమకూరింది. టికెట్లు విక్రయాల ద్వారా రూ.7,36,000, వివిధ సేవలు, విరాళాల రూపంలో రూ.98252, ప్రసాద విక్రయాల ద్వారా రూ.2,04000 ఆదాయం సమకూరినట్టు ఇన్‌ఛార్జి ఇఒ శోభారాణి తెలిపారు.

సెలవులో ఇఒ

అరసవల్లి ఇఒ వై.భద్రాజీ దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. అనారోగ్య కారణాలతో దేవాదాయశాఖ అనుమతి తీసుకున్న ఆయన 20 రోజుల పాటు సెలవుపై వెళ్లినట్టు అధికారులు తెలిపారు. తాత్కాలికంగా ఆలయ కార్యనిర్వహక బాధ్యతలను దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ శోభారాణికి అప్పగించారు.

పాడి రైతులకు బాసట

- 50 శాతం రాయితీపై పశువుల దాణా
- 'ఉపాధి' నిధులతో గోశాలల నిర్మాణం
- పచ్చగడ్డి పెంపకానికి ప్రోత్సాహకాలు
- పాడి ఉత్పత్తి పెంపునకు ప్రభుత్వం తోడ్పాటు
- పశుసంవర్ధకశాఖ జెడి డాక్టర్ రాజగోపాల్

ప్రజాశక్తి- శ్రీకాకుళం

వ్యవసాయ ఆధారిత జిల్లా అయిన శ్రీకాకుళంలో రైతులకు ప్రభుత్వం మేలు చేకూర్చేందుకు పెద్దఎత్తున చర్యలు చేపడుతుందని పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కంచరాన రాజగోపాల్ తెలిపారు. పశు సంవర్ధకశాఖ రైతు ప్రయోజనం చేకూర్చేందుకు వీలుగా పాడి పరిశ్రమను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తుందన్నారు. పాడి ఉత్పత్తి పెంపు ద్వారా రైతులకు ఆర్థికంగా భరోసా ఇస్తున్నట్టు చెప్పారు. పాడి పశువులకు గోకులం షెడ్ల నిర్మాణం, రాయితీపై గడ్డి పెంచుకునేందుకు విత్తనాలు సరఫరా, రాయితీపై దాణా సరఫరా చేస్తున్నట్టు వెల్లడించారు. పశుసంవర్ధకశాఖ ద్వారా అమలు చేస్తున్న పలు పథకాలను ముఖాముఖిలో భాగంగా 'ప్రజాశక్తి'కి వివరించారు.

? పశువుల సంతతి పెంచుకునేందుకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు?

జిల్లాలో పూర్వం నుంచి సాధారణ పశువుల పెంపకం అలవాటుగా వస్తోంది. గడచిన దశాబ్ద కాలంగా మార్పు అనివార్యమని భావించిన రైతాంగం వివిధ సంకరజాతి మేలైన రకాల పశువుల పెంపకానికి శ్రీకారం చుట్టారు. పాడి ఉత్పత్తిని పెద్దఎత్తున పెంచుకుని రైతులు ఆర్థికంగా మరింత వృద్ధి చెందడానికి తోడ్పడుతోంది. పాత దేశవాళీ రకాలైన ఆవులు, గేదెల వల్ల పాడి ఉత్పత్తి తక్కువగా ఉంటుంది. సంకరజాతి రాకల్లో పాడి ఉత్పత్తిని పెంచుకునేందుకు అనేక రకాలైన కొత్త పద్ధతులు రైతులు అన్వయించుకుని ఇప్పుడిప్పుడే కొంత ప్రయోజనం పొందుతున్నారు. అందుకే ప్రభుత్వం ఈ పరిశ్రమను పెద్దఎత్తున ప్రోత్సహిస్తోంది. పాడి పరిశ్రమను వృద్ధి చెందడానికి అనువుగా గ్రామాల్లో రైతాంగానికి పూర్తి సహకారాన్ని అందిస్తున్నాం. జిల్లాలో 1,01,182 కుటుంబాలు పాడి పశువుల పెంపకంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. జిల్లాలో 3,41,335 తెల్ల పశువులు, 25,451 నల్లజాతి పశువులు పెంపకం కొనసాగుతోంది. వీటిలో 1,68,000 పాలిచ్చే పశువులు ఉన్నాయి. వాటి పెంకం ద్వారా పాల ఉత్పత్తి ఘనణీయంగా పెరిగింది.

? పశువుల పెంపకానికి ఆర్థికభారం కాకుండా తీసుకున్న చర్యలు ఏమిటి?

జిల్లాలో ఏటా పశువుల పెంపకంపై ఆసక్తి పెరుగుతోంది. ప్రభుత్వమే నేరుగా ఇతర ప్రాంతాలనుంచి ఆవులు, గేదెలను కొనుగోలు చేసి రైతులకు రాయితీపై అందజేస్తుంది. రాయితీని వినియోగించుకుని రైతులు నచ్చిన రకానికి చెందిన పశువులను తీసుకొచ్చి పెంచుతున్నారు. ముర్రా, ఒంగోలు, పశ్చిమ బెంగాల్, కేరళ, తమిళనాడు తదితర ప్రాంతాల నుంచి వీటిని కొనుగోలు చేసి లబ్ధి పొందుతున్నారు. పశుసంవర్ధకశాఖ ప్రభుత్వ పథకాలను అమలు చేయడమే బాధ్యత. వ్యాపార లావాదేవీలతో పనిలేదు. అందువల్ల రైతులే మేలైన జాతి పశువులను ఎంపిక చేసుకుని తెచ్చుకుంటున్నారు. బ్యాంకు రుణం, లబ్ధిదారుని వాటి, ప్రభుత్వ రాయితీ చెల్లించడం ద్వారా ఈ పథకాన్ని రైతులు సద్వినియోగపర్చుకుంటున్నారు. పశువులకు ఇస్తున్న దాణా, పచ్చగడ్డి రైతులే కొనుగోలు చేసుకోవచ్చు. వారికి ప్రభుత్వం 50 శాతం రాయితీ కల్పిస్తోంది.



? ఎటువంటి రాయితీలు పొందడానికి వీలుంది.?

ప్రస్తుతం వేసవి కాలం కావడం వల్ల పచ్చగడ్డి కొరత తీవ్రంగా ఉంది. పాడి పశువులు పాల ఉత్పత్తి కోసం రైతులు సమీ పశువుల దాణాను ఉపయోగించడంతో పాల ఉత్పత్తికి అయ్యే ఖర్చు పెరగటంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. రైతులు ఎదుర్కొంటున్న ఈ సమస్యను ప్రభుత్వం గుర్తించి, వేసవిలో పాడి పశువుల పాల ఉత్పత్తిని నిలబెట్టడానికి 50 శాతం రాయితీతో సమీకృత దాణాను సరఫరా చేస్తోంది. జిల్లాలోని పశువులకు సమీకృత పశువుల దాణాను అందించడానికి 17576 మెట్రిక్ టన్నుల దాణా అవసరమవుతుందని గుర్తించాం. వారిలో అవసరం ఉన్న వారికి రాయితీపై దాణా ఇస్తున్నాం. రైతు సేవా కేంద్రాల ద్వారా దీన్ని రైతులకు అందిస్తున్నాం. భారత్ పశు ధాన్ యాప్‌లో రైతు పేరు నమోదు చేసుకోవాలి. పశువులకు క్రమం తప్పకుండా టీకాలు వేసి ఉండాలి. 50 శాతం రాయితీపై ఒక కుటుంబానికి గరిష్ట సీలింగ్ పరిమితి 90 రోజులకు 450 కిలోలు వరకు దాణా పొందడానికి వీలుంది. రెండు పెద్ద పశువులు, ఒక ఆవు పడ్డకు, మూడు విడతలుగా విభజించి నెలకు 150 కిలోల సరఫరా చేయాల్సి ఉంది. డిమాండ్ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో, ప్రారంభంలో మూడు బస్తాల పశువుల దాణాకు బదులుగా, ఒక బస్తా మాత్రమే పంపిణీ చేయాలని నిర్ణయించాం. పశుదాణా 50 కేజీల ప్యాకింగ్‌లో విక్రయిస్తాం.

? రాయితీ పొందడానికి ఎలాంటి షరతులు వర్తిస్తాయి?

పశువుల దాణా పొందడానికి 50 కేజీల బస్తా రూ.1110 చెల్లించాల్సి ఉంటుంది. అందులో ప్రభుత్వ రాయితీ రూ.555, లబ్ధిదారుని వాటా రూ.555 చెల్లించాలి. గ్రామీణ ప్రాంత రైతులు సమీప రైతు సేవా కేంద్రం వద్ద దాణా కోసం ఆన్‌లైన్‌లో ధరఖాస్తు చేసుకోవాలి. నిష్పత్తి ఆధారంగా రైతు సేవా కేంద్రంలో పశువుల దాణా కేటాయించాం. వ్యవసాయ పనుల ఒత్తిడి, దోమల బెడద, వాతావరణంలో వస్తున్న మార్పుల వల్ల పశువుల్లో వ్యాధులు సంక్రమిస్తుంటాయి. వాటికి అవసరమైన మందులు, ఉచిత టీకాలు ప్రభుత్వం పెద్దఎత్తున సమకూరుస్తోంది. గర్భకోశ వ్యాధులు, నట్టల నివారణ, వ్యాధి నిరోధక టీకాలు, వ్యాధి నిర్ధారణ పరీక్షలు, శాస్త్రీయ యాజమాన్యంపై రైతులకు అవగాహన కల్పించాం. క్షేత్రస్థాయిలో పశువైద్యాధికారి, పారా వెటర్నరీ సిబ్బంది, గోపాల మిత్ర, పశు సంవర్ధకశాఖ ఎడి, వరకు సేవలపై రైతులు చర్చించేందుకు వీలుంది.

? మినీ గోకులాల నిర్మాణానికి ఎలాంటి సాయం అందిస్తున్నారు?

జిల్లా వ్యాప్తంగా ఉపాధి పథకం నిధులతో పెద్దఎత్తున మినీ గోకులాలు నిర్మిస్తున్నాం. జిల్లాలో ఇప్పటికే సుమారు 900 గోకులాల నిర్మాణానికి అనుమతులు ఇచ్చాం. ప్రభుత్వ నిబంధనలకు లోబడి వీటిని నిర్మిస్తున్నాం. ఆరు పశువులు ఉన్న మినీ గోకులానికి రూ.2.30 లక్షలు యూనిట్ ధరగా నిర్ణయించారు. అందులో రైతుల వాటి రూ.23 వేలు కాగా, మిగిలిన మొత్తం ఉపాధి నిధుల నుంచి ఖర్చు చేస్తారు. అలాగే నాలుగు పశువులు ఉన్న మినీ గోకులం ఏర్పాటుకు రూ.1.85 లక్షలు అంచనా వేస్తే... అందులో రూ.18,500 రైతుల వాటా రూ.1,66, 500 ఉపాధి నిధులు ఖర్చు చేస్తారు. అలాగే రెండు పశువుల ఉన్న మినీ గోకులానికి రూ.1.15 లక్షలు కేటాయిస్తే.. అందులో రైతు వాటి రూ.11,500 చెల్లించాల్సి ఉంటుంది. మిగిలిన రూ.1.03,500 ప్రభుత్వం ఉపాది నిధుల నుంచి కేటాయించాం. ఎస్‌సి, ఎస్‌టి, డినోటిఫైడ్ తెగలు, వలసదారులు, కుటుంబంలో అంగవైకల్యం ఉన్న వారు, చిన్న సన్నకారు రైతులు ఈ పథకం పొందడానికి అర్హులు. అయితే వారు ముందుగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. దరఖాస్తుతో ఆధార్, జాబ్‌కార్డు, స్థలం హక్కు పత్రం, బ్యాంకు పాస్ బుక్ ఇస్తే అర్హులైన వారిని గుర్తించి మంజూరు చేస్తాం.

కిస్నా డైమండ్ నూతన షోరూం ప్రారంభం

ప్రజాశక్తి- శ్రీకాకుళం

ప్రముఖ బంగారు వజ్రాభరణాల సంస్థ కిస్నా డైమండ్ అండ్ గోల్డ్ జ్యువెలరీ ఆంధ్రప్రదేశ్‌లో తమ రెండవ ఎక్స్‌క్లూజివ్ షోరూంను ఆదివారం శ్రీకాకుళంలోని పాలకొండ రోడ్‌లో గాంధీ పార్క్ పక్కన ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేంద్ర పౌర విమానయాన శాఖామంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు హాజరై ఈ నూతన షోరూంను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బంగారు వజ్రాభరణాల ప్రేమికులకు అత్యంత చేరువలో అత్యాధునిక డిజైన్లు, వెరైటీలతో కిస్నా డైమండ్ అండ్ గోల్డ్ జ్యుయలరీ తమ శాఖను ప్రారంభించడం ఎంతో సంతోషమన్నారు. ఈ ప్రాంత ప్రజలు నూతన వెరైటీల కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా నచ్చిన మోడళ్లను అతి తక్కువ సమయంలో ఇక్కడే కొనుగోలు చేయవచ్చునన్నారు. అదేవిధంగా ఉత్తరాంధ్ర ప్రాంతంలో కిస్నా సంస్థ మరిన్ని షోరూంలను ప్రారంభించాలన్నారు. అనంతరం హరికృష్ణ గ్రూపు వ్యవస్థాపకుడు ఘనశ్యామ్ డోకియాల మాట్లాడుతూ ఆంధ్రరాష్ట్రం బంగారు ఆభరణాల మార్కెట్‌కు అనుకూలంగా ఉందని ఈ ప్రత్యేక షోరూం శ్రీకాకుళం వాసుల అభిమానాన్ని ఆదరణను పొందాలని, తమ సంస్థ దేశంలోనే అత్యంత వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న బంగారు నగల వ్యాపార సంస్థని ఆయన అన్నారు. అనంతరం కిస్నా డైమండ్

షోరూంను ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

అండ్ గోల్డ్ జ్యుయలరీ డైరెక్టర్ పరాగ్‌షా మాట్లాడుతూ రానున్న మాతృ దినోత్సవాన్ని పురస్కరించుకొని తయారు చేసిన ప్రత్యేక కలెక్షన్ అందుబాటులో ఉందని, ప్రారంభోత్సవ కానుకగా డైమండ్ జ్యుయలరీ మేకింగ్ చార్జీలపై 50 నుంచి 100 శాతం తగ్గింపు అందిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ ప్రాంత సాంస్కృతిని ప్రతిబింబించే విధంగా పలు డిజైన్లను ఈ షోరూంలో అందుబాటులో ఉంచడం జరిగిందని, ప్రజలు తమ షోరూంను సందర్శించి తమను ఆదరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గొండు శంకర్, కిస్నా ఫ్రాంచైజీ పార్టనర్లు సరిత, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం నూతన షోరూం ప్రారంభోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించి ఆహారం పంపిణీ చేపట్టారు.

రైల్వే గేటుతో గంటల తరబడి నిరీక్షణ

వంతెన నిర్మించాలని ప్రయాణికుల వేడుకోలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

పురపాలక సంఘం పరిధిలోని ఊసవానిపేట రైల్వేగేటు వద్ద గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి తరచూ ఏర్పడుతుందని ప్రయాణికులు, వాహనదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం మధ్యాహ్నం రైలు వెనక రైలు వరుసగా మూడు రైళ్ల రావడంతో రైల్వేగేటు మూసివేయడంతో ప్రయాణికులు, వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నిత్యం ఈ రైల్వేగేటు గుండా ప్రయాణించాలంటే గంటల తరబడి సమయాన్ని వృధా చేసుకోవాల్సిందేనని పలువురు రైల్వేశాఖ అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. రైల్వేగేటు పడిందంటే సుమారు అరగంట సమయం అక్కడే ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని పలువురు ప్రయాణికులు చెబుతున్నారు. రైళ్లు వచ్చే సందర్భంలో ఒక్కోసారి ఈ రైల్వేగేటు మూసివేయడంతో చేరాల్సిన గమ్యస్థానాలకు చేరలేక పోతున్నామని పలువురు ప్రయాణికులు వాపోతున్నారు. రైల్వేగేటు గంటల తరబడి మూసివేయడంతో అనుకున్న సమయానికి రైలు, బస్సు ప్రయాణాలకు చేరుకోలేకపోవడంతో గమ్యస్థానాలకు చేరుకోలేకపోతున్నామని పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

రైల్వే గేటు వేయడంతో నిరీక్షిస్తున్న వాహనదారులు, ప్రజలు

వంతెన నిర్మించి ఇబ్బందులు తొలగించాలి

ఊసవానిపేట రైల్వేగేటు వద్ద వంతెన నిర్మిస్తామని గడచిన దశాబ్ద కాలంగా పాలకులు మాటలు చెప్పడమే గాని చేతల్లో చూపించడం లేదని పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు నియోజకవర్గ పరిధిలోని ఊసవానిపేట, దూసి రైల్వేగేటు వద్ద వంతెన నిర్మాణానికి పరీక్షలు నిర్వహించి మట్టి నమూనాలు సేకరించినప్పటికీ అవి కార్యరూపం దాల్చక కాగితాలకే పరిమితమయ్యాయని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఆర్‌ఒబి, రైల్వేకం ఓవర్ బ్రిడ్జి నిర్మించి ప్రజలు, ప్రయాణికుల కష్టాలను తీర్చాలని పలువురు ముక్తకంఠంతో కోరుతున్నారు.

కుక్కల దాడిలో గాయపడిన లేగదూడ

కుక్కల దాడిలో లేగదూడ మృతి

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని తండ్యాంలో కుక్కల దాడిలో ఆదివారం లంకలపల్లి వెంకటరావుకు చెందిన లేగదూడ మృతి చెందింది. రైతు తన కల్లంలోని ఏడాది వయసు గల లేగదూడను కట్టి ఇంటికి వెళ్లేసరికి కుక్కలు గుంపు ఒక్కసారిగా దాడి చేశాయి. ఈ దాడితో కడుపులోని ప్రేగులు సైతం బయటకు వచ్చేశాయి. అక్కడే ఉన్న మరో రైతు గమనించి కుక్కలను తరిమివేశాడు. వెంటనే గ్రామ సర్పంచ్ ప్రతినిధి కిల్లారి భాస్కరరావు పశువైద్యాధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి చికిత్స చేస్తుండగా లేగదూడ మృతి చెందింది. గ్రామానికి సమీపంలోని పొలాల్లో కుక్కలు గుంపులుగా తిరుగుతుండడంతో రైతులు వ్యవసాయ పనులకు వెళ్లేందుకు భయపడుతున్నారు. ఇప్పటికే గ్రామంలో గొర్రెలు, మేకలతో పాటు పవువులపై కుక్కలు దాడి చేస్తున్నాయని, చిన్నారులపై కూడా దాడి చేస్తాయోమోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడు ఏ విధంగా కుక్కలు దాడి చేస్తాయోనని గ్రామస్తులు భయపడుతున్నారు. అధికారులు స్పందించి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

విజేతలుగా నిలిచిన చిన్నారులు

బ్యాడ్మింటన్ పోటీల్లో చిన్నారుల ప్రతిభ

ప్రజాశక్తి- శ్రీకాకుళం

మహారాష్ట్రలోని అక్తాపూర్‌లో ఉన్న ఫుడ్‌షాట్ బ్యాడ్మింటన్ అకాడమీ ఆధ్వర్యాన నిర్వహించిన జూనియర్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో జిల్లాకు చెందిన చిన్నారులు ప్రతిభ కనబర్చారు. అండర్ 9 గర్ల్స్ సింగిల్స్ విభాగంలో చెల్లూరి శాన్వీ అద్భుతమైన ఆటతీరును ప్రదర్శించి విజేతగా నిలిచింది. అలాగే అండర్ 11 గర్ల్స్ సింగిల్స్ విభాగంలో సహస్ర విజయాన్ని అందుకుని గోల్డ్ మెడల్ సాధించింది. ఇక అండర్ 11 బాయ్స్ సింగిల్స్‌లో సజయ్ తెరుపల్లి విజేతగా నిలిచి గోల్డ్‌మెడల్ సాధించాడు. అండర్ 11 బాయ్స్ డబుల్స్ విభాగంలో సజయ్ తెరుపల్లి, శ్రీలికిత్ జోడి ఫైనల్లో సిల్వర్ మెడల్ సాదించారు. ఈ సందర్భంగా విజేతలకు ట్రోఫీ, సర్టిఫికెట్‌లు బహుకరించారు. ఈ సందర్భంగా శాన్వి చెలూరి, సహస్ర, సజయ్ తెరుపల్లి, శ్రీలికిత్‌ని మ్యాచ్ పాయింట్ చైర్మన్, హెడ్‌కోచ్ వేణు ముప్పాల అభినందించారు.

ఎంఆర్‌సికి చేరిన పాఠ్యపుస్తకాలు

ప్రజాశక్తి- పొందూరు

రానున్న విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సకాలంలో పాఠ్య పుస్తకాలను అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పాఠశాలకు సరఫరా చేసేందుకు అవసరమైన పాఠ్య పుస్తకాలు స్థానిక ఎంఆర్‌సి ఆదివారం చేరాయి. సర్వేపల్లి రాధాకృష్ణ, కిట్లు మండల కన్వీనర్ ఎంఇఒ-2 ఆధ్వర్యంలో పుస్తకాలను భద్రపరిచారు. మండలంలో 4,582 మంది విద్యార్థులకు మెదటి విడతలో 21037 పుస్తకాలు చేరినట్లు ఎంఇఒలు జి.శ్రీరాములు, పి.రాజారావు తెలిపారు.

డిసిసిబి చైర్మన్‌ను సన్మానిస్తున్న వరాహ నరసింహం తదితరులు

టిడిపిలో కార్యకర్తలకు ప్రత్యేక గుర్తింపు

ప్రజాశక్తి- ఆమదాలవలస

రాష్ట్రంలో ఏ రాజకీయ పార్టీలో లేని విధంగా టిడిపిలో కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని డిసిసిబి చైర్మన్ శివ్వాల సూర్యనారాయణ అన్నారు. ఆదివారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో నియోజకవర్గ టిడిపి లీగల్‌సెల్ అధ్యక్షులు పైడి వరాహ నరసింహ ఆధ్వర్యంలో శివ్వాలకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌ఛార్జిలు, క్రియాశీలక కార్యకర్తల సమావేశంలో సూర్య నారాయణ మాట్లాడుతూ పార్టీకోసం నిరంతరం శ్రమించిన కార్యకర్తలకు చంద్రబాబు నాయుడు సముచిత స్థానం కల్పిస్తారన్నారు. పార్టీని నమ్ముకున్న తనలాంటి ఎంతోమంది వ్యక్తులకు టిడిపిలో ఉన్నత పదవులు కట్టబెట్టిందన్నారు. దీనిని గ్రహించి ప్రతి కార్యకర్త, నాయకులు టిడిపి బలోపేతానికి మరింత కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు అంబల్ల రాంబాబు, లావేటి పూర్ణారావు, మీసాల రామారావు, కందుల వెంకటరావు, కదిరి మల్లేశ్వరరావు, తమ్మినేని అమర్నాథ్ పాల్గొన్నారు.

వేణుకి స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకోవాలి

ప్రజాశక్తి- కవిటి

విద్యార్థి దశ నుంచే ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకుని దానికి అనుగుణంగా పక్కా ప్రణాళికలతో ముందుకు సాగితే విజయం తథ్యమని భారత నావికాదళంలో లెఫ్టినెంట్‌గా పనిచేస్తున్న దుద్ది వేణు అన్నారు. చిన్న వయసులోనే భారత నావికాదళంలో లెఫ్టినెంట్‌గా ఉద్యోగోన్నత పొందిన కవిటి మండలం గొండ్యాలపుట్టుగకు చెందిన దుద్ది వేణు ఆదివారం గ్రామానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా స్నేహితులు, గ్రామస్తులు అతనికి ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తనకు జన్మనిచ్చిన తల్లిదండ్రులు, విద్య నేర్పిన గురువుల ప్రేరణ, వారి ప్రోత్సాహమే తన ఉన్నతికి కారణమని అన్నారు. తల్లిదండ్రులు, గురువులను మించిన దైవం లేదని, వారు చూపించిన మార్గంలో పయనిస్తే అన్నింటా విజయమేనని అన్నారు. అదే సమయంలో నేటి యువతలో అపారమైన శక్తి సామర్థ్యాలు దాగున్నాయని, వాటికి ప్రోత్సాహం అందిస్తే అద్భుతాలు సృష్టిస్తారని అన్నారు. కార్యక్రమంలో వేణు బాల్య స్నేహితులు, స్నేహితులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆధార్ స్పెషల్ క్యాంపు

ప్రజాశక్తి- పాతపట్నం

ఈ నెల 5 నుంచి మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో పుట్టిన నుంచి ఆరేళ్ల వయసు ఉన్న పిల్లలకు కొత్త ఆధార్ ఎన్రోల్‌మెంట్ చేయించుకునేందుకు అవకాశం కల్పించామని ఎంపిడిఒ పి.చంద్రకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్ న్యూ ఎన్రోల్‌మెంట్, మ్యాండెట్రీ బయోమెట్రిక్ అప్‌డేట్ ఉన్న వారు కూడా వినియోగించుకోవాలన్నారు.

నిరుపయోగంగా భవనాలు

పిచ్చి మొక్కల మధ్య పాత హౌసింగ్ కార్యాలయం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని ప్రజా అవసరాల కోసం నిర్మించిన పలు ప్రభుత్వ భవనాలు వినియోగం లేక నిరుపయోగంగా మారాయి. దీంతో అవి పిచ్చి మొక్కల మధ్య దర్శనమిస్తున్నాయి. మండల పరిషత్ కార్యాలయం వెనుక పాత హౌసింగ్ భవనం వినియోగం లేక శిథిలావస్థకు చేరుకుంది. అలాగే ఎఒ కార్యాలయం వద్ద అక్షర క్రాంతి భవనం వినియోగం లేక నిరుపయోగమైంది. గతంలో ఇందులో మరుగుదొడ్లకు సంబంధించి నిర్మాణ సామగ్రిని ఉంచేవారు. ప్రస్తుతం అవి వినియోగం లేక నిరుపయోగమయ్యాయి. అలాగే పర్లాకిమిడి రోడ్‌లో ఏర్పాటైన ఐటిడిఎ షాపింగ్ కాంప్లెక్స్‌ను గిరిజన నిరుద్యోగులకు ఉపాధి చేకూరేలా దీనిని ఏర్పాటు చేశారు. షాపింగ్ కాంప్లెక్స్‌లో ఐదు గదులు ఉండగా, ప్రస్తుతం రెండు గదులను మాత్రమే వినియోగిస్తున్నారు. మిగిలిన మూడు గదులను నిరుపయోగంగా పడి ఉన్నాయి. మెళియాపుట్టి వేణుగోపాలస్వామి ఆలయం ఎదురుగా మార్కెట్ యార్డు వినియోగం లేక నిరుపయోగైంది. దీనితో

పిచ్చి మొక్కల మధ్య అక్షర క్రాంతి భవనం

మండలంలో దాదాపు రూ.50 లక్షల మేర ప్రజాధనం వృథాగా మారింది. పాలకులు, అధికారులు దృష్టి సారించి నిరుపయోగంగా ఉన్న భవనాలను వినియోగంలోకి తెచ్చేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

పార్టీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న రవికుమార్

వైసిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి- ఆమదాలవలస

గడచిన ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థి సువ్వారి గాంధీతో నడచిన రెండు వార్డులకు చెందిన కార్యకర్తలు వైసిపిలో చేరారు. ఆదివారం పట్టణంలోని వైసిపి కార్యాలయంలో వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ సమక్షంలో పురపాలక సంఘంలోని 8వ వార్డుకు చెందిన బి.మహేష్, సాయి, చిన్ని, కిరణ్, అలాగే 14వ వార్డుకు చెందిన అన్యపు సంజయ్ కుమార్, కూన రాజశేఖర్, పిన్నింటి పవన్, తిర్లంగి కిరణ్, ఎన్ని మురళి, గురుగుబెల్లి శ్రీను తదితరులు పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి రవికుమార్ కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో అందరం కలసికట్టుగా కూటమి ప్రభుత్వంపై పోరాడు దామన్నారు. 2029 ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డిని సిఎంగా చేయడమే ధ్యేయంగా ప్రతిఒక్కరూ పని చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్ కుమార్, పట్టణ అధ్యక్షుడు పొడుగు శ్రీనివాసరావు, జిల్లా ఇంట లెక్చువల్ ఫోరమ్ అధ్యక్షుడు కొప్పుల ఈశ్వరరావు పాల్గొన్నారు.

గుత్తావల్లి రోడ్డుకు నిధుల మంజూరు

ప్రజాశక్తి- ఆమదాలవలస

నియోజకవర్గంలోని బూర్జ మండలం గుత్తావల్లి బిటి రహదారి అభివృద్ధికి నిధులు మంజూరైనట్లు టిడిపి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. రోడ్లు, భవనాల శాఖ జారీ చేసిన ఉత్తర్వులు ప్రకారం సిఎస్‌పి రహదారి నుంచి వయా నారాయణపురం మీదుగా గుత్తావల్లి బిటి రహదారికి రూ.2.80 కోట్లతో ప్రభుత్వం మంజూరు చేసినట్లు తెలిపారు. దీర్ఘకాలిక సమస్యగా ఉన్న ఈ రహదారి అభివృద్ధికి నిధులు అడిగిన వెంటనే మంజూరు చేసిన సిఎం చంద్రబాబు నాయుడు, రోడ్లు భవనాల శాఖామంత్రి బిసి జనార్దన్ రెడ్డికి ఎమ్మెల్యే కూన రవికుమార్ కృతజ్ఞతలు తెలియజేసినట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

6న శ్రీరాములు వర్ధంతి

వజ్రపుకొత్తూరు: బమ్మిడి శ్రీరాములు ప్రథమ వర్ధంతి సభ ఈ నెల 6న నిర్వహిస్తున్నామని కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు బి.ఆనందరావు ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని నగరంపల్లిలో ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభలో వ్యవసాయ రంగ సంక్షోభాలు పరిష్కారం అనే అంశంపై సదస్సు నిర్వహిస్తామన్నారు. ఈ సదస్సుకు రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షులు వి.కృష్ణ పాల్గొంటారని తెలిపారు. ప్రజా వైద్యులు డాక్టర్ తెప్పల ఆనందరావు, నగరంపల్లి గ్రామ పెద్దలు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు.

నగదు అందిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

జైహింద్ ఫౌండేషన్ ఉదారత

కవిటి: భిక్షాటన చేసుకుంటూ జీవిస్తున్న జాడుపూడి కాలనీకి చెందిన కంబం రాములు అనే మహిళ తీవ్ర అనారోగ్యానికి గురై మంచం పట్టింది. భిక్షాటన చేయనిదే పొట్టనిండని రాములు పరిస్థితి తెలుసుకున్న జైహింద్ ఫౌండేషన్ సభ్యులు ఆమెకు అండగా నిలిచారు. ఆదివారం జాడుపూడి చేరుకున్న ఫౌండేషన్ సభ్యులు ఆమె వైద్య ఖర్చుల నిమిత్తం రూ.5 వేలు అందించారు. అంతేకాకుండా ఫౌండేషన్ సభ్యుడైన మురపాల ధర్మారావు మరికొంత మందితో కలిసి వ్యక్తిగతంగా ఆమెకు కొంత నగదు అందించారు. అనంతరం సభ్యులు మాట్లాడుతూ దయనీయ స్థితిలో ఉన్న రాములును దాతలు మానవీయ దృక్పథంతో ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో జైహింద్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

తాగునీటి పథకాన్ని ప్రారంభిస్తున్న ఎంపిపి దాసు

అభివృద్ధి పనులు ప్రారంభం

సోంపేట : మండలంలోని కర్తలిపాలెం పంచాయతీ పరిధిలో ఎంపిపి నిధులతో నిర్మించిన సామాజిక భవనం, తాగునీటి పథకాలను ఎంపిపి నిమ్మన దాసు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ఎంపిపి నిధులు వినియోగి స్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పి. గున్నయా, మంగి గణపతి, సిలగాన భాస్కరరావు, బాబూ రావు, జ్ఞానేశ్వరరావు, పాపారావు, ధర్మారావు, శంకర్ పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

సోంపేట : స్థానిక లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన ఆదివారం నిర్వహించిన వైద్య శిబిరానికి స్థానికుల నుంచి స్పందన లభించిందని సంస్థ అధ్యక్షుడు గోపీకృష్ణ తెలిపారు. గాంధీ మండపం కూడలి వద్ద వైద్య శిబిరం నిర్వహించి ప్రతి ఒక్కరి బ్లడ్ గ్రూపులు తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అత్యవసర సమయాల్లో ప్రతిఒక్కరూ తమ బ్లడ్ గ్రూప్ గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా 225 మందికి తమ బ్లడ్ గ్రూప్‌కి సంబంధించిన వివరాలతో కూడిన కార్డులు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రమణ తదితరులు పాల్గొని సహకారం అందజేశారు.

సమ్మెకు మెడికల్ అండ్ సేల్స్ రిప్స్ భాగస్వామ్యం

శ్రీకాకుళం: దేశ వ్యాప్తంగా అసంఘటిత, సంఘటిత రంగాల్లో పని చేస్తున్న కార్మికులు ఈ నెల 20న చేపట్టనున్న అఖిల భారత సమ్మెలో భాగస్వాములు కావాలని ఎపి మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు సత్తిబాబు పిలుపునిచ్చారు. ఈ సమ్మెలో మెడికల్ రిప్రజెంటేటివ్స్ పాల్గొనాలని ఆయన కోరారు. ఆదివారం నగరంలోని సిఐటియు కార్యాలయంలో యూనియన్ ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తోందన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు మాట్లాడుతూ కార్మిక, కర్షక లేబర్ చట్టాలను తొలగించి కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందని, దీనివల్ల కార్మికుల హక్కులు హరించబడతాయన్నారు. కార్మికులకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రతిఘటించ డానికి సమ్మెలో భాగస్వాములు కావాలన్నారు. సమావేశంలో మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి దేవాది వాసుదేవరావు, అధ్యక్షులు ఎన్.మహేశ్వర రావు, ఉపాధ్యక్షులు ఆచారి ఎస్.రామ్, శ్రీకాంత్, సహకార్యదర్శులు వెంకటరావు, శ్రీనివాసరావు, కోశాధికారి సిహెచ్ రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న షణ్ముఖరావు

సమ్మెను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

కార్మికులు అనుభవిస్తున్న చట్టాలన్నీ పోరాడి సాధించుకున్నవేనని సిఐటియు నాయకులు నంబూరు షణ్ముఖరావు అన్నారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో ఈ నెల 20న నిర్వహించనున్న అఖిల భారత సమ్మెపై ఆదివారం కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమరశీల పోరాటాల ద్వారా సాధించిన చట్టాలు, హక్కులు కారాస్తూ... లేబర్ కోడ్‌లను తెచ్చిందన్నారు. ఈ నాలుగు లేబర్ కోడ్లు వల్ల కార్మికులు హక్కులను కోల్పోతారని అన్నారు. అందుకు సమ్మెకు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా గ్రానైట్ వర్కర్స్ యూనియన్ నాయకులు చింతాడ తేజేశ్వరరావు, వాకాడ ధనుంజయరావు, లమునిపల్లి రామ్మూర్తి, పెట్రో ఎల్లాయిస్ యూనియన్ నాయకులు బోసు, రైతు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కొల్లి యల్లయ్య, బగాది కృష్ణారావు, ఆటో కార్మికులు తమిరి సూర్యనారాయణ, వి.పోలయ్య, ఉర్జాన దుర్గాప్రసాద్, సరస్వతి, గ్రానైట్ కార్మికులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక

ప్రజాశక్తి- పొందూరు

పొందూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1997-98 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఒకరినొకరు పలకరించుకుని యోగక్షేమాలను, కుటుంబ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అలాగే పాఠశాల స్థాయిలో మధుర స్మృతులను గుర్తుకు తెచ్చుకుని ఆనందంగా గడిపారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పి తమ ఉన్నతికి బాటలు వేసిన ఉపాధ్యాయులను జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆనాటి ఉపాధ్యాయులు పొగిరి జగన్నాథం, విద్యావతి, వెంకటరావు, సత్యనారాయణ, రవికుమార్, జగన్నాథప్రసాద్, సుధాకర్ పట్నాయక్ పాల్గొన్నారు.

ఆమదాలవలస: పట్టణంలోని వెంకటేశ్వర కళ్యాణ మండపంలో మండలంలోని అక్కులపేట జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుకున్న 1985 -1986 పదో తరగతి పూర్వపు విద్యార్థుల కలయిక ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి పాఠాలు బోధించిన గురువులను సన్మానించారు. ఉపాధ్యాయులు బి.షణ్ముఖరావు విద్యార్థులు కలయిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆనాటి తీపి జ్ఞాపకాలు గుర్తు చేసుకుని అందరూ ఆనందంతో గడిపారు. పాఠశాలకు అలనాటి విద్యార్థులంతా ఏదో ఒక సహాయం


పొందూరు : పదోతరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం

అందించాలని నిర్ణయించుకున్నారు.

రణస్థలం రూరల్: మండలం కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1998 - 1999 సంవత్సరం పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అప్పటి ఉపాధ్యాయులు ఎం.ఎస్.కుమార్, పిన్నింటి సూర్య నారాయణ, నందిగాం జోగారావు, సత్యవతి, మహంతి లక్ష్మునాయుడు, ధర్మారావు, అప్పారావు, రెడ్డి లక్ష్మునాయుడు, బలగ అనసూయలను దుశ్శాలువ కప్పి సన్మానించారు. చిన్ననాటి స్నేహితులందరూ కలిసి ఆ చిన్ననాటి చిలిపి జ్ఞాపకాలు నెమరవేసుకుంటూ సంతోషంగా గడిపారు.

నౌపడ : సంతబొమ్మాళి మండలం దండుగోపాలపురం జెడ్‌పి ఉన్నత పాఠశాలలో 2009-10 పూర్వ విద్యార్థులు అపూర్వ కలయిక కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా అడిషనల్ డైరెక్టర్ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారి రోనంకి గోవిందరావు పాల్గొన్నారు.

వార్తా పత్రికలు చదవాలి

ప్రజాశక్తి- లావేరు

విద్యార్థులు వార్తా పత్రికలు చదవడం అలవాటు చేసుకోవాలని గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాస రావు అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం దిన, వార, పక్ష, మాస పత్రికలు కోసం విద్యార్థులకు క్షుణ్ణంగా వివరించారు. 40 మంది విద్యార్థులతో పత్రికలను చదివించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దినపత్రికలు చదవడం వలన ప్రపంచంలో ఉన్న విజ్ఞానాన్ని తెలుసుకోవచ్చున్నారు. అనంతరం కథలు చదవడం, కథల చెప్పడం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు వీరభద్రుడు, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నౌపడ: సంతబొమ్మాళి, నౌపడ శాఖాగ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు ఆదివారమూ కొనసాగుతున్నాయి. సంతబొమ్మాళి గ్రంథాలయంలో లైబ్రేరియన్ రామకృష్ణ, నౌపడలో బి.రూపావతి ఆధ్వర్యాన విద్యార్థులతో పుస్తక పఠనం, సీనియర్ విద్యార్థులతో కథలు చెప్పించారు. హెల్పర్లు ప్రసాద్, పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయములో పుస్తక ప్రదర్శన

నందిగాం : వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా స్థానిక శాఖాగ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి ఎస్.ఉదయ్‌కిరణ్ పుస్తక ప్రదర్శన నిర్వహించారు. పుస్తక పఠనం ద్వారా మానసిక వికాసం, జ్ఞానం, విజ్ఞానం పెంపొందించుకోవాలన్నారు. వేసవిలో ప్రతిఒక్కరూ గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పాఠకులు, 18 మంది విద్యార్థులు పాల్గొనారు.

జర్నలిస్టులకు పింఛను మంజూరు చేయాలి



మాట్లాడుతున్న శంకర్‌రెడ్డి

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

వర్కింగ్ జర్నలిస్టులకు రూ.పది వేలు ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్నట్లు ఇక్కడా పింఛను మంజూరు చేయాలని ఎపి ఓల్డేజ్ వర్కింగ్ జర్నలిస్టు వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు కర్రి శంకర్‌రెడ్డి కోరారు. స్థానిక పెన్షనర్ల భవనంలో ఆదివారం ఎపి ఓల్డేజ్ వర్కింగ్ జర్నలిస్టు వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజానికి ఎన్నో ఏళ్లుగా సేవలు అందించారని అన్నారు. వృద్ధాప్యంలో కూడా జర్నలిస్టు వృత్తిలో కొనసాగుతున్న ఓల్డేజ్ వర్కింగ్ జర్నలిస్టులకు పాలకులు కనీసం పట్టించుకోవడం లేదని ఆవేదం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ఓల్డేజ్ వర్కింగ్ జర్నలిస్టులకు పింఛన్లు, ఇళ్ల స్థలాలు, అక్రిడేషన్ కార్డులు, ఉచితంగా కార్పొరేటర్ ఆస్పత్రుల్లో వైద్యం, ప్రమాద బీమా, రైలు ప్రయాణ సౌకర్యాలు కల్పించాలన్నారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షునిగా కర్రి శంకర్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షునిగా పేడాడ పరమేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా కిల్లి శ్రీనివాసరావు, అశోక్ కుమార్‌రెడ్డి, ఎస్.విశ్వేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి పి.వి.ఎస్.ఎన్.మూర్తి, సంయుక్త కార్యదర్శులుగా ఎన్.చంద్రరావు, ఆర్.వి.పట్నాయక్, కోశాధికారిగా బగాది వాసుదేవరావు, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

రింగ్ రోడ్డుకు శంకుస్థాపన

ప్రజాశక్తి- ఆమదాలవలస

పురపాలక సంఘంలోని ఆరో వార్డు సప్తపురాలు పరిధిలోని నాదనపురం గ్రామం వద్ద చిట్టివాని చెరువు చుట్టూ రింగ్ రోడ్డుకు టిడిపి మండల అధ్యక్షుడు నూక రాజు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ నాదనపురానికి చెందిన పాతిన వెంకట రమణ తన సొంత ఖర్చుతో చిట్టివాని చెరువును అభివృద్ధి చేసి చుట్టూ రింగ్ రోడ్డు నిర్మించడానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా వెంకట రమణను రాజుతో పాటు గ్రామస్తులు, టిడిపి నాయకులు అభినందించారు. అనంతరం వెంకటరమణ మాట్లాడుతూ చింతాడ రెవెన్యూ నాదనపురానికి చెందిన చిట్టివాని చెరువు విస్తీర్ణం గతంలో ఏడు ఎకరాలు ఉండేదని ఆక్రమణలకు గురై నాలుగు ఎకరాలపైన ప్రస్తుతం ఉందన్నారు. చెరువు ఆక్రమణకు గురి కాకూడదన్నదే తన అభిమతమన్నారు. చెరువులో పూడికతీతలు తీసి గట్టును దృఢపరచి చెరువు చుట్టూ రింగ్ రోడ్డు నిర్మించి ఆహ్లాదకరంగా తయారు చేస్తానన్నారు. సింగుపురం నీటిసంఘం అధ్యక్షుడు పొదిలాపు రాజారావు, కమిటీసభ్యులు పేడాడ రాజగోపాల రావు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

చిన్నారికి ఆర్థికసాయం

ప్రజాశక్తి- లావేరు

విజయనగరం జిల్లా రాజాం మండలం బూరాడ గ్రామానికి చెందిన గులివిందల సహశ్రీ అనే ఎనిమిదేళ్ల చిన్నారి అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న లావేరు మండలం సహాయం చేస్తున్న హృదయాలు ఫౌండేషన్ సభ్యులు ఆదివారం బూరాడ గ్రామానికి వెళ్లి చిన్నారి తల్లిదండ్రులు భాస్కరరావు, శిరీషాకు వైద్యఖర్చుల నిమిత్తం రూ.పది వేలు నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యులు అప్పలరాజు, మీసాల త్రినాథరావులు మాట్లాడుతూ ఆపదలో ఉన్న సాటివారికి సహాయం చేసి పేద కుటుంబాన్ని ఆదుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా తెరవే కవి సమ్మేళనం

ప్రజాశక్తి- శ్రీకాకుళం

నగరంలోని శాంతినికేతన్ జూనియర్ కళాశాలలో తెలుగు రచయితల వేదిక 104 వ నెల నెలవారీ సాహితీ సమ్మేళనం ఆదివారం జరిగింది. సంస్థ అధ్యక్ష కార్యదర్శులు ఉత్తరావల్లి నాగేశ్వరరావు, రఘుపాత్రుని వెంకట రమణమూర్తి ఆధ్వర్యాన జరిగిన ఈసమ్మేళనంలో కవులు తమ కవితలను వినిపించారు.

అర్చకునికి ఆర్థికసాయం

పొందూరు: మండలం మలకాంకు చెందిన అర్చకుడు విభూది నీలకంఠంకు విజయనగరం జిల్లా రాజాం మండలం డోలపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన పలువురు పూర్వ విద్యార్థులు ఆర్థికసాయాన్ని అందజేశారు. రహదారి ప్రమాదంలో తలకు తీవ్రగాయాలై మంచం పట్టిన అర్చకునికి రూ.31 వేలు నగదును అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఎ.ఆర్.కె.రంగారావు, మాచెర్ల జగదీష్, టంకాల సోమశేఖర్, వావిపల్లి శ్రీకాంత్, మోహన్ గాంధీ, రవి, అప్పారావు, రాంబాయి, చంద్రశేఖర్ తదితరులున్నారు.

ఎమ్మెల్యేను కలిసిన డిసిసిబి చైర్మన్

పాతపట్నం: ఇటీవల నియమితులైన డిసిసిబి చైర్మన్ శివ్వాల సూర్యనారాయణ ఎమ్మెల్యే మామిడి గోవిందరావును ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ టిడిపి కష్టకాలంలో ఉన్న సమయంలో పార్టీని ముందుండి నడిపించిన కార్యకర్తలేనని, వారికి గుర్తింపు ఉంటుందని అన్నారు.